# సంక్షోభం చుట్టుముట్టిన ఈ సమయాన

# కా॥టి.ఎన్. బోధించి, ఆచరించిన విప్లవ మార్గాన ముందుకుసాగుదాం

**విప్లవ** సిద్ధాంతాన్ని చదవటం, అర్ధంచేసుకోవటం, వల్లెవేయ గల్గటం–వానికవే గొప్ప విషయాలు ఎంతమాత్రమూ కావు. మార్క్సిజాన్ని అధ్యయనంచేయటం, విప్లవ కార్యాచరణకు, జీవితానికి దానిని అన్వయించటం, ప్రజలనుండి నేర్చుకునే సహనంతో అంకితమవటం– ఒక్కమాటలో–విప్లవ విజయమనే ఏకైక కారణంకోసం తమ యవ్వనాన్ని, జీవితాన్ని, సర్వస్వాన్నీ పణమొడ్డటం–మహత్తరమైనది. దీనికితోడు విప్లవ మేధోకృషితో, విప్లవోద్యమ నాయకులుగా దార్శనికులుగా వెలుగొందటం చాలా కొద్దిమందికే సాధ్యం .అలాంటి మహత్తర విప్లవ నాయకులలో పేరెన్నికగలవాడు కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి. జులై 28న కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి 45వ వర్ధంతి సందర్భంగా ఆ కామ్రేడ్‌కు జోహార్లర్పిద్దాం.



సిపిఐ(ఎం–ఎల్) కేంద్ర కార్యదర్శివర్గ సభ్యులు, సుదీర్ఘకాలం 'జనశక్తి'కి సంపాదకునిగా వ్యవహరించిన కామ్రేడ్ జస్వంతరావు గత సం॥రం ఆగస్టు 28న మరణించిన విషయం తెలిసిందే. కామ్రేడ్ టి.ఎన్ మరణించిన సంవత్సరమే వృత్తి విప్లవకారునిగా ప్రకటించుకున్న కా॥జస్వంత్, ఆర్ధికశాస్త్రంపై అవగాహన పెంచుకునే కృషిచేశారు. వైద్యశాస్త్రంలో పట్టా తీసుకొని, సమాజశస్త్ర చికిత్సకు మార్క్సిస్టు తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేశారు. కా॥టి.ఎన్. లోటును ఆర్థిక రంగంలో పూరించాలనే పట్టుదలతో మేధోకృషి సాగించారు. కా॥టి.ఎన్. 'తాకట్టులో భారతదేశం' ఆధారంగా ఎన్నో విశ్లేషణాత్మక వ్యాసాలు వ్రాశారు;

ప్రసంగాలు చేశారు. పాలకుల గణాంకాల గారడీలను, అంకెల సాక్ష్యాలతోనే త్రిప్పికొట్టేవారు. కా॥టి.ఎ న్.శతజయంతి సభలలోనూ, ఎన్నో వర్ధంతి సభలలోనూ రాష్ట్రవ్యాపితంగా తిరిగి ప్రసంగించారు. 'తాక ట్టులో భారతదేశం' పుస్తకం రెండవ ముద్రణకు ముందుమాట ఆర్థికరంగంలో కా॥జస్వంత్ విశ్లేషణా శక్తిని చాటుతుంది.

కా॥టి.ఎన్ వర్ధంతి సందర్భంగా చివరగా గత సంవత్సరం 'జనశక్తి'లో కా॥జస్వంత్ వ్రాస్తూ 'కమ్యూని స్టు విప్లవకారుల వైతాళికుడు కా॥టి.ఎన్' అంటూ జోహార్లర్పించారు. భారత విప్లవోద్యమంపై ఆయన ప్రస రించిన వెలుగు విప్లవ మార్గదర్శకంగా వుంటుందన్న కా॥జస్వంత్ నిర్ధారణ అక్షర సత్యం.

భారత దళారీ బూర్జువావర్గం గురించి అంచనా చెబుతూ సామ్రాజ్యవాదుల భోజనాల బల్లవద్ద జారిపడే ఎంగిలి మెతుకులకోసం వెంపర్లాడేవారుగా టి.ఎన్. వారిని అభివర్ణించారని, వారి వర్గ స్వభావాన్ని వివరించే ప్రతి సందర్భంలోనూ నొక్కి చెప్పేవారు. ఫ్యూడలిజంతో రాజీపడి భూస్వామ్య సంబంధాలను బలీయం చేస్తున్న, సామ్రాజ్యవాదానికి సేవ చేస్తున్న నేటి పాలనావ్యవస్థను కూలదోయాలనే, నూతన ప్రజా స్వామిక వ్యవస్థను స్థాపించుకోవాలనే కా॥టి.ఎన్. బోధనలను కా॥జస్వంత్ పునరుద్ఘాటించారు.

భారత పాలకవర్గాలు విప్లవాత్మక సంస్కరణలద్వారా భూస్వామ్య వ్యవస్థను మార్చడానికి పూనుకోవని, దశాబ్దాలపాటు భారత రైతాంగాన్ని అత్యంత దోపిడీ అణచివేతలకు గురిచేసి అతినెమ్మదిగా అతిక్రూరంగా, రక్తమాలిన్యాలలో నుండి పడలాగుతూ ఈ పరివర్తన సాగిస్తాయన్న కా॥టి.ఎన్. విశ్లేషణను ఉదహరించిన ప్రతి సందర్భంలోనూ కా॥జస్వంత్ గొంతు గద్గదమవటం అందరికీ అనుభవంలోనిదే. ఈ క్రమ పరివర్త నను నిరాకరించి, విప్లవ కార్యాచరణతో విప్లవాత్మక మార్పులకోసం-ప్రజల పక్షాన, రైతాంగ పక్షాన నిలచి విప్లవకారులు నాయకత్వం వహించాలని ఆయన ఉద్బోధించారు.

ప్రస్తుత కరోనా ఉపద్రవంతో ప్రజానీకం విలవిల్లాడు తుండగా, ప్రజలపై పన్నుల భారాన్ని పాలకులు పెంచుతూపోతున్నారు. రోజువారీగా పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో నిత్యావసరాల ధరలు, ప్రయా ణ, రవాణా ఛార్జీలు పెనుభారమౌతున్నాయి. రెండు సంవత్సరాలుగా వెంటాడుతున్న కరోనా మహమ్మా రి కారణంగా కోట్లాదిమంది ప్రజానీకానికి కాస్తోకూస్తో ఆధారంగా వున్న ఉపాధి అవకాశాలు కూడా లేకుం డాపోయాయి. అనారోగ్యాల బారినపడి ప్రభుత్వ వైద్యానికి దిక్కులేక ఎందరో అప్పులపాలవుతున్నారు. కష్ట కాలంలో ప్రజలను ఉదారంగా ఆదుకోవలసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నెపాన్ని ఒకరిపై ఒకరు తోసుకుం టూ ప్రజలను గాలికొదిలేస్తున్నాయి. చిన్న వృత్తులు, చిన్న వ్యాపారాలు చితికిపోయాయి. కనీస ఉపాధికర వై కొనుగోలుశక్తి కోల్పోయి పూటగడవని స్థితిలోనున్న పేద, శ్రామిక ప్రజానీకం, భవిత అగమ్యగోచరంగా నున్న యువత, మధ్యతరగతి ప్రజానీకం, రైతాంగం, కార్మికవర్గ ప్రజానీకం తీవ్ర అసంతృప్తితో రగిలిపోత న్నారు. రైతాంగ మనుగడను ప్రశ్నార్థకం చేసే నల్లచట్టాలకు వ్యతిరేకంగా ఢిల్లీ సరిహద్దులనే ఆవాసంగా చే సుకొని పెద్ద సంఖ్యలో రైతాంగం గత 7 నెలలుగా నిరవధికంగా ఆందోళన సాగిస్తున్నారు.

ప్రస్తుత పరిణామాలన్నింటినీ దేశ రాజకీయ, ఆర్థిక సంక్షోభాల పర్యవసానాలేనని కా॥టి.ఎన్ చేసిన విశ్లేషణను తదనంతర కాలానికి అన్వయించి, ఆ విశ్లేషణ సరైనదని కా॥జస్వంత్ నిర్ధారించారు.

ప్రభుత్వరంగం గురించి కా॥టి.ఎన్. చెబుతూ భారత బూర్జువావర్గానికి వీటిని నిర్వహించగలిగే శక్తిలే దని, ప్రజాధనంతో ప్రభుత్వం ఈ మౌలికరంగ భారీ పరిశ్రమలను స్థాపించి, నిర్వహించి, బడాపెట్టుబడిదా

రీ వర్గానికి ఎలా తోడ్పడిందో వివరించారు. ఈనాడు వాటినే పాలకులు బడా, బహుళజాతి యాజమాన్యాల కు ఏవిధంగా కారుచౌకగా కట్టబెడుతున్నారో విశ్లేషిస్తూ కా॥జస్వంత్ పలు వ్యాసాలు రాశారు.

భారత పాలకవర్గాలు నిరంతర సంక్షోభంలో కూరుకుపోయి, ప్రజలను తమ ప్రభావంలో నిలబెట్టుకోగ ల పరిస్థితిలో లేవు. ప్రజల జీవితాలను మెరుగుపరిచే సంస్కరణలు చేస్తామన్న పాలకుల వాగ్దానాలన్నీ బూ టకమని తేలిపోయాయి. తాత్కాలికంగా ప్రజల దృష్టి మరల్చటానికి, వారిని ఆశలపల్లకిలో ఊరేగించి ఊరి ంచటానికి పాలకులు జనాకర్షక పథకాలుగా, వీటిని మరింతగా దిగజార్చి జనాకర్షక చిట్కాలుగా, ఈనాడు లబ్ధిదారులపేరిట కొందరిని ఎంపికచేసి, వారి బ్యాంకు ఖాతాలలో నేరుగా ఎంతో కొంత నగదు జమచేయ ంటంగా దిగజార్చారు. దీనినంతా దేశ రాజకీయ ఆర్థిక సంక్షోభపు దుస్థితిగా కా॥టి.ఎన్. పేర్కొన్నారు. ప్రజ లనుండి భారత పాలకులు ఎంతగా వేరుపడిపోయారో ఈ అంశాలు స్పష్టం చేస్తున్నాయన్నారు.

మరోవైపున బడాపారిశ్రామికవేత్తలకు, బహుళజాతి కంపెనీలకు పాలకులు వీసమెత్తు నష్టం జరగకుం డా చూసుకుంటున్నారు. కరోనా విజృంభించిన రెండు దశల్లో 'ఆత్మ నిర్భర భారత్' పేరిట 2 విడతలుగా కేంద్రప్రభుత్వం ప్రకటించిన లక్షలకోట్ల నిధులలో సింహ భాగాన్ని రాయితీలు, ఉద్దీపనలు, పన్ను మినహాం యిపులపేర దోపిడీ వర్గాలకే కట్టబెడుతున్నారు. కరోనా ఘోరపరిస్థితుల నడుమ కూడా బడావ్యాపార వర్గాల ఆస్తులు అనూహ్యంగా పెరగటమే దీనికి తార్కాణం.

ప్రజల ప్రాణాలర్పించి పోరాడి సాధించుకున్న, లాభాలలో నడుస్తున్న ప్రభుత్వ విశాఖ ఉక్కు పరిశ్రమన ు, హెచ్‌పిసిఎల్ వంటి పరిశ్రమలను అమ్మేందుకు కరోనా కాలంలోనే పాలకులు నిర్ణయించారు. ప్రభుత్వ బ్యాంకులు, ఎల్ఐసివంటి ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటు యాజమాన్యాలకు ధారాదత్తంచేసే నిర్ణయాలు తీసుకున్నారు. ఈ చర్యలన్నీ దేశ, విదేశీ పెట్టుబడిదారీ వర్గానికి విందు భోజనాలే కదా?! కరోనా నుండి ప్రజలను రక్షించే బదులుగా ప్రపంచ పెట్టుబడిదారీ సంక్షోభ భారాన్ని ప్రజలవీపులపై మోపేందుకు కరోనా ను పాలకులు ఉపయోగించుకుంటున్నారు.

పాలకులు ప్రజలపై మోపుతున్న భారాలతో, అసలే అస్తుబిస్తుగా జీవిస్తున్న ప్రజల బ్రతుకులు మరింత దుర్భరమౌతున్నాయి. వీరి అసంతృప్తి వివిధ సందర్భాల్లో నిరసన, ఆందోళనల రూపం తీసుకుంటున్నది. కొన్నిచోట్ల మిలిటెంట్ రూపం తీసుకుంటున్నది. ప్రజలపై, ప్రజాఉద్యమాలపై పాలకుల అణచివేత తీవ్రమైం ది. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించటమే 'రాజద్రోహం' అవుతోంది. ఫాశిస్టు తరహా నిర్బంధం అమలవుతోం ది.

మరోవైపున దళితులపైన, ఆదివాసులపైన, మతమైనారిటీలు, అల్పసంఖ్యాకులపైన తీవ్రంగా దాడులు సాగుతున్నాయి. ప్రజలను విభజించి పాలించేవిధంగా కుల, మత, జాతి, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టి పాలకముఠాలే వానికి నాయకత్వం వహిస్తున్నాయి. ప్రజలను ప్రక్కదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయి.

1970ల నాటికున్న పరిస్థితులను కా॥టి.ఎన్.విశ్లేషించి రాగల పరిణామాలను, పర్యవసానాలను గతి తార్కిక దృష్టితో స్పష్టపరిచారు. ఈ అవగాహన వెలుగులో కా॥జస్వంత్ 1990ల నాటి సామ్రాజ్యవాద ప్రపంచీకరణ, నూతన ఆర్థికవిధానాల అమలు పర్యవసానాలను శాస్త్రీయంగా విశ్లేషించారు. సామ్రాజ్యవా ద దోపిడీ కొనసాగింపే నూతన ఆర్థిక విధానాలని వివరిస్తూ, ఈ విధానాల అమలుకు ముందు దేశపరిస్థితి

బాగుందనే కొందరు వామపక్షవాదుల సూత్రీకరణను పూర్వపక్షం చేశారు. గ్రామీణ ఆర్థికవ్యవస్థలో పెట్టుబడిదారీ సంబంధాలు పెరగటానికీ, పెట్టుబడిదారీ విధానంగా రూపాంతరం చెందటానికీ మధ్యగల తేడాలను సోదాహరణంగా వివరించేవారు. గ్రామీణ ప్రాంతాల్లో అర్థఫ్యూడల్ సంబంధాలు బలీయంగా నేటికీ కొనసాగుతుండటాన్ని కా॥జస్వంత్ నొక్కి చెప్పారు. సామ్రాజ్యవాద దోపిడీ విధానాలలో వస్తున్న మార్పుల్ని అధ్యయనంచేసి విశ్లేషించటమేగాకుండా, కా॥టి.ఎన్. బోధించిన సూత్రీకరణల ప్రాసంగికతను, ప్రాధాన్యతను ఎత్తిపట్టారు.

ప్రజలను భ్రమల్లో ముంచటానికి, చీల్చటానికి, అణచివేయటానికి పాలకులు ఎన్ని ప్రయాసలు పడినప్పటికీ కుతకుత ఉడుకుతున్న అగ్ని పర్వతంలాగున్న పీడిత ప్రజల అసంతృప్తి ఏదోనాడు బ్రద్దలవటం ఖాయం. అయితే వీరిని సమీకృతంచేసి, వీరిలో విశ్వాసాన్ని ప్రోదిచేసి, సంఘటితపరిచే స్వీయాత్మకశక్తులు బలహీనంగా వుండటమే దోపిడీ పాలకులకు వరప్రసాదమౌతోంది. పాలకులు తమ అధికారపీఠంపై కులకటానికి ఈ పరిస్థితే అవకాశం కల్పిస్తోంది తప్ప, వారు ప్రచారం చేసుకుంటున్నట్లు వారి నాయకుల సుపరిపాలనో, ఛరిస్మానో, పలుకుబడో ఎంతమాత్రమూ కారణము కాదు. మార్క్సిజం–లెనినిజం–మావోఆలోచనా విధానం వెలుగులో ప్రజలను విప్లవకార్యాచరణకు కదిలించే విప్లవశక్తులన్నీ ఏకతాటిపైకి రావలసిన అవసరాన్ని ప్రస్తుత పరిస్థితులు డిమాండ్ చేస్తున్నాయి. ఈ దిశగా విప్లవకారుల ఐక్యతకోసం కృషిసల్పటానికి ప్రతినబూనుతూ కా॥తరిమెల నాగిరెడ్డికి విప్లవజోహార్లర్పిద్దాం.